# నిర్ణయం

తెల్లవారింది.

మరోసారి బద్ధకంగా ఆవలించి పక్కకి ఒత్తిగిలి పడుకుంది శాంతి.

తెల్లవారిందని మరోసారి రుజువు చేస్తూ వెలువడిందో శబ్దం.

శాంతి చప్పున మంచం మీద లేచి కూర్చుని, కిటికీ రెక్క కొద్దిగా తెరిచింది.

నిజంగానే తెల్లవారింది.

కానీ రోజూలా కాదు.

"నాయనా! నా తండ్రీ నీకప్పుడే నూరేళ్ళు నిండాయా? నాకింక దిక్కేది బాబూ!" ప్రశ్నిస్తోందో మాతృమూర్తి.

"నా బ్రతుకంతా చీకటి చేసి పోయావుకదయ్యా! నేనేం కావాలి? ఈ పిల్లల్ని ఎట్లా పెంచాలి? నేనెట్టా బతకను?" భర్త మృతదేహాన్ని ప్రశ్నిస్తోందో ఇల్లాలు.

ఎదురింటి వాకిట్లో చాపమీద పడుకోబెట్టబడి ఉంది ఓ శవం. శాంతి గబగబా అక్కడికెళ్ళింది. శాంతిని చూస్తూనే దుర్గమ్మ బావురుమంది.

"శాంతమ్మా! నా బిడ్డకి నూరేళ్ళు నిండాయి తల్లీ. రాత్రి డ్యూటీ నుంచి వస్తుంటే లారీ గుద్దేసింది. రాత్రంతా ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుకుని చచ్చిపోయాడు."

శాంతి బ్రాన్పడిపోయింది. నిన్న సాయంత్రం డ్యూటీకి వెళ్ళేటప్పుడు వచ్చి తనను కలిశాడు సత్యం. మనియార్డరు చేసిన రశీదు ఇచ్చి వెళ్ళాడు. ప్రతి నెలా అమ్మావాళ్ళకి తను సత్యం ద్వారానే మనియార్డరు పంపిస్తుంది. అంతేకాదు తనకెంతో సాయం చేస్తాడు సత్యం. 'చెల్లెమ్మా! చెల్లెమ్మా!' అంటూ తన బిడియాన్ని పోగొట్టి ఎంతో ఆప్యాయత చూపించే సత్యం, నిర్జీవంగా పడి ఉన్నాడు. అతని చుట్టూ తల్లి, పిల్లలు, భార్య, బంధువులు కూర్చుని ఏడుస్తున్నారు. తండ్రి దూరంగా కండువాలో మొహం దాచుకుని నిల్చున్నాడు. సత్యం మంచితనాన్ని నలుగురికి

సాయపడే అతని తత్వాన్ని బంధువులంతా గుర్తు చేసుకుంటూ మరీ ఏడుస్తున్నారు.

శాంతి మనసు కలచివేసినట్లయింది. గుండె భారంగా అయింది. నెమ్మదిగా వెళ్ళి సత్యం భార్యని, తల్లిని చెరో చేత్తో దగ్గరికి తీసుకుంది. శాంతి ఒంటరిగా ఈ జీవనం సాగించటం మొదలుపెట్టిన ఈ ఏడాదిలో తనను కంటికి రెప్పలా చూసుకుంటూ, ఆప్యాయతను పంచి ఇచ్చి, తల్లిదండ్రులను, తోబుట్టువులను మరిపించిన కుటుంబం. చేతికంది వచ్చిన కొడుకు పోయిన దుర్గమ్మ హృదయ విదారకంగా ఏడుస్తోంది. అతని భార్య అంధకార బంధురమైన తన భవిష్యత్తులో పిల్లలకి దారి కనిపించక కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది.

ఈ పరిస్థితుల్లో ఆ బాధార్తులను ఎలా ఓదార్చాలో అర్థంకాలేదు శాంతికి. రాత్రి తను ఫ్రెండ్స్‌తో సెకండ్‌షో సినిమాకెళ్ళి వచ్చి నిద్రపోయింది. దుర్గమ్మ ఇంట్లో ఇంత విషాదకరమైన సంఘటన జరిగిందని ఇప్పుడే తెలిసింది. శాంతికి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. మంచివాళ్ళకే అకాల మరణం సంభవిస్తుందేమో! నెమ్మదిగా రుద్ధమైన కంఠంతో అన్నది.

“లే దుర్గమ్మా! నువ్వే ఇలా బాధపడితే ఆ అమ్మాయిని ఓదార్చే వాళ్ళెవరు? నువ్వేడ్చినంత మాత్రాన అతను బతికొస్తాడా? లే ధైర్యం తెచ్చుకో! చూడు, వాళ్ళంతా ఎలా ఏడుస్తున్నారో! పద లోపలికి. లేవాలి మరి.” అసహజంగా అనిపిస్తున్నా, ఎలాగో ఓదార్చటానికి ప్రయత్నించింది శాంతి. ఆమెకి తెలుసు. తన ఓదార్పు అర్థం లేనిదని. సత్యం మరణం ఆ కుటుంబానికి గొడ్డలిపెట్టు. అతని మీద ఆధారపడి బతుకుతున్న ఆ ఐదు ప్రాణాలకు దిక్కెవరు అన్నది ముందున్న మహా సమస్య. “ఎట్లా తట్టుకోను తల్లీ! ఎట్లా తట్టుకోను” గుండెలు పగిలేలా ఏడుస్తూ అన్నది. సత్యం అత్తగారు భోరున ఏడుస్తూ “నా బిడ్డ పాతికేళ్ళకే పసుపు కుంకుమలకు దూరమైంది తల్లీ!” అంటూ గొల్లుమంది.

ఆ రోజు జరగవలసిన తంతు అంతా ఏదో వాళ్ళ పద్ధతి ప్రకారం జరిపించారు. సత్యం కొడుకు పదేళ్ళవాడు శవం వెనకాల కుండలో నిప్పు తీసుకెళ్ళటం, శవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళటం, దారిలో అందరూ గట్టిగా ఏడవడం... ఇదంతా అయోమయంగా అనిపించింది.

“దినకర్మలకి బోలెడు డబ్బు కావాలి బంధువులంతా వస్తారు” అంది సత్యం తల్లి. శాంతి తెల్లపోయింది. “దినకర్మలేవిటి? బంధువులంతా రావడమేమిటి?”

“దినాలు చేయాలి కదమ్మా! పదోరోజు, పదకొండోరోజు, పన్నెండో రోజు

మూడు రోజులు చేయాలి. బంధువులంతా ఈ మూడు రోజులుంటారు. పదోరోజు మా కోడలికి పసుపు కుంకుమలు తీసేస్తాము."

శాంతి నిలువెల్లా వణికిపోయింది. ఎప్పుడో ఒక తెలుగు సినిమాలో చూసింది. భర్త పోయిన నాయికకి ఆడవాళ్ళంతా కలిసి నీళ్ళుపోసి, గాజులేసి మరీ పగలకొట్టడం, బొట్లు పెట్టి మరీ తుడిపేయటం, ఇలాంటి దారుణాలు నిజంగా ఈ సమాజంలో ఇంకా జరుగుతున్నాయా?

"ఎంత మోటు పద్ధతులివి? వీటినా సంప్రదాయాలనేది? సమాజం మారిందన్నారే! మరి ఎక్కడ? ఈ దుర్గమ్మ ఏవిటి ఇలా మాట్లాడుతోంది? లేదు అలా జరగటానికి వీల్లేదు. దుర్గమ్మకి తెలీదు కాబోలు" శాంతి కొంచెం గట్టిగా అరిచింది.

"లేదు దుర్గమ్మా! అదంతా చేయనవసరంలేదు. వచ్చిన డబ్బు బాంక్‌లో దాచి పిల్లల చదువులకు ఉపయోగించండి. మీ అబ్బాయి పనిచేసిన చోట మీ కోడలికి ఉద్యోగం ఇస్తారు, ఆ అమ్మాయి ఆ ఉద్యోగం చేసుకుంటూ నాలుగక్షరం ముక్కలు నేర్చుకుంటుంది. తన కాళ్ళమీద తాను నిలబడుతుంది. ఇవన్నీ చాదస్తాలు దుర్గమ్మా! ఈ కాలంలో కూడా ఇంకా ఇలాంటి నమ్మకాలతో డబ్బు వృధా చేయకూడదు."

"మీరంతా చదువుకున్నవాళ్ళు తల్లీ! మీకు తప్పు అయినవి మాకు ఒప్పు. మాకు ఒప్పు అయినవి మీకు తప్పు. ఇదంతా చేయకపోతే, మా బంధువులంతా మమ్మల్ని ఆడిపోసుకుంటారు. పిల్లాడు పోయి నాలుగు రోజులన్నా కాకుండా వాడిని మర్చిపోయావీస్త్రమంటారు. అయినా నా కొడుకుకు కావలసిన వాళ్ళం మేమంతా బతికి ఉండి వాడిని అనాథ శవంలాగా తగలేసి ఊరుకోలేం కదమ్మా!"

రెండు మూడు రోజులు గడిచిపోయాయి. శాంతి యథాప్రకారం ఆఫీసు నుంచి రాగానే ఆ ఇంటికెళ్ళి వాళ్ళకు కావాల్సిన సాయం చేస్తూనే ఉంది. ఎంతో ప్రయత్నించిన మీదట సత్యం భార్య భారతితో మాట్లాడే అవకాశం కలిగింది.

నెమ్మదిగా, తనకు జరగబోతున్న అన్యాయపు తంతు తెలియని దానిలా, నిర్లిప్తంగా ఉంది భారతి. వంటింట్లో కూర్చుని ఆమెకు జరగబోయే అన్యాయం వివరించి, ఆ ఆచారాన్ని ప్రతిఘటించమని ఆవేశంతో చెప్పింది శాంతి.

అంతా విన్న భారతి నీరసంగా అన్నది. "నావల్ల కాదు శాంతక్కా! నాకంత ధైర్యం లేదు. అయినా ఎప్పటినుంచో జరుగుతోన్న పద్ధతులను నాకోసం మారుస్తారా? అమ్మా, అత్త, అక్కలు, వదినలు ఎవరూ ఒప్పుకోరు. నేను గొడవ చేస్తే,

బొట్టు కోసం ఏడుస్తున్నానని, మొగుడు పోయినా ఫర్వాలేదు బొట్టు కావాలా? అని నానా మాటలంటారు. అంతకన్నా వాళ్ళేం చేసినా నోరు మూసుకుని ఊరు కోవడం మంచిది."

"అలా అనుకుంటే ఎలా భారతీ? మీ అత్తలాగా అందరూ సంఘానికి భయపడి ఆచారాలనుకుంటూ, ఇలాంటి అనాచారం పాటిస్తున్నారు. నీలాగే అత్త లకు, అమ్మలకు, అక్కలకు, అమ్మలక్కలకు భయపడి అందరూ వాళ్ళ పనిని సమర్థిస్తున్నారు. ఇలా ప్రతివాళ్ళూ ఎదుటివాళ్ళకు భయపడుతూ ఉంటే ప్రగతి అనేది ఎలా సాధ్యమవుతుంది? సంఘం, సంఘం అంటారు, ఇలా భయపడే వాళ్ళంతా ఈ సంఘంలోని మనుషులేగా, పదిమంది భారతులు, ఇరవైమంది దుర్గమ్మలు, ఇంకా కొందరు మల్లమ్మలు, ఎల్లమ్మలు వీళ్ళందరి కలయికే ఒక సంఘం. అలాంటి సంఘానికా మీరంతా భయపడేది? ఎంత విషాదం! ఇలాంటి పనులు నీ ఒక్కదానికి అవమానం కాదు. మొత్తం స్త్రీ జాతికే అవమానం. పది మంది ఆడవాళ్ళు కలిసి నీ బొట్టు చెరిపేయడమనే సంప్రదాయం. సంప్రదాయం కాదు, నీచత్వం, అమానుషత్వం. ఈ మనుషుల కుళ్లు మనస్తత్వానికి ప్రతిబింబం. నువ్వు దీనిని ప్రతిఘటించాలి నామాట విను భారతీ..."

"నేను నీలాగా పెద్ద చదువులు చదువుకోలేదు శాంతక్కా! నువ్వు మాట్లాడే వన్నీ పెద్దపెద్ద మాటలు. అవన్నీ నాకర్థం కావు. నేనింతే, నా బతుకింతే. ఆయనే చనిపోయాక నాకు బొట్టు అంత ముఖ్యం కాదు. నేనెలా ఉంటే ఏం? నా బిడ్డల్ని పెద్దవాళ్ళను చేస్తే చాలు."

భారతి వెక్కివెక్కి ఏడ్చింది నిస్సహాయంగా.

శాంతి ప్రయత్నాలన్నీ విఫలం అయినాయి. ఆరోజు రానే వచ్చింది. ఎదురింట్లోంచి శోకాలు గుండె చెదిరిపోయేలా వినిపిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఆరోజు ఆదివారం. శాంతి ఎలాగైనా ఆ సంఘటన జరక్కుండా ఆపాలని ఇంట్లోనే ఉండిపోయింది.

పక్కింట్లో ఉంటున్న సునంద దగ్గరకెళ్ళింది శాంతి. సునంద, ఆమె కొడుకు ఉంటున్నారు. సునంద బ్యాంక్‌లో పనిచేస్తోంది. శాంతిని చూడగానే, "రండిరండి శాంతిగారూ కూర్చోండి" అని ఆహ్వానించింది సునంద.

"సునందగారూ, ఈరోజు ఎదురింట్లో చాలా ఘోరం జరగబోతోంది తెలుసా?" అడిగింది శాంతి.

"ఏవిటండీ అది?" గాభరాగా అడిగింది సునంద.

"సత్యంపోయాడు కదండీ. ఇవాళ పదోరోజు. పాపం భారతికి బొట్టు తీసేయడం అలాంటివేవో చేస్తారట."

"అదా! ఏవిటో అనుకున్నాను. అది మామూలే కదండీ!" తేలిగ్గా అన్నది సునంద. అదిరిపడింది శాంతి. ఎంత ఈజీగా అంటోంది. ఈమె చదువుకుని ఉద్యోగం చేస్తోన్న సునందేనా?

"కానీ, ఇంకా మన సమాజంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయంటే నాకు చాలా బాధగా ఉందండీ" అంది.

"బాధే కాని, మనకు కొన్ని కస్టమ్స్ ఉన్నప్పుడు వాటిని ఫాలో అవ్వాలిగా, ఏంచేస్తాం" శాంతికి అసహ్యం వేసింది. కస్టమ్సట. దానికో భాష ఎరువు తెచ్చుకోడం కూడా.

"అందుకే నేనివాళ మా అమ్మగారింటికి వెళ్ళాలనుకుంటున్నాను."

"దేనికి?" విచిత్రంగా అడిగింది శాంతి.

"దేనికేవిటండీ? మీరు వట్టి అమాయకుల్లా ఉన్నారే! ఎల్లుండి భారతి మొహం చూడకూడదు. పొరపాటుగా కనిపిస్తే ఎలా? పైగా మంగళవారం కూడాను. మీరు కూడా చూడకండి, పెళ్ళికావాల్సినవారు.

"ఆమెని చూస్తే నాకు పెళ్ళి కాదంటారా? చదువుకున్నవాళ్ళు మీరు కూడా ఇలా మాట్లాడటం నాకు బాధగా ఉంది."

"మీకు నమ్మకం లేదా ఏం? పెద్దవాళ్ళు ఊరికే అనలేదండీ! ఏదో లేకపోతే ఇలాంటి రూల్స్ అన్నీ ఎందుకు పెడతారు? మాంగల్యం ఉంటేనే స్త్రీకి రక్షణ, గౌరవం." అంటూ మెళ్ళో మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంది.

"అయినా, మీ పిచ్చిగాని, మనం గొంతు చించుకున్నంత మాత్రాన, అన్నీ మనం అనుకున్నట్టు జరుగుతాయా? వ్యక్తుల్లో మార్పు రావాలి. సంస్కారం ఉండాలండీ! ఇలాంటి సంస్కరణలు రావడానికి. అయినా ఆమె బొట్టు తీయనంత మాత్రాన మనమంతా ఆమెని ముత్తయిదువగా అంగీకరించి బొట్టు పెట్టగలమా?" సునంద రాగం తీస్తూ అన్నది.

ఎంత హిపోక్రసీ! సంస్కారం కావాలిట. సంస్కారంలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో కూడా తెలీని సునంద సంస్కారం గురించి మాట్లాడుతోంటే రోత పుట్టింది. నిరసనగా అన్నది.

"పెట్టగలమా? అనకండి. నేను పెట్టగలను. పెట్టి తీరుతాను" విసురుగా

అనేసి బైటికొచ్చేసింది. తనక్కాస్త సపోర్ట్‌గా ఉంటుందని ఆశపడ్డ సునంద అలా మాట్లాడటంతో శాంతికి పిచ్చెక్కినట్లయింది. మహిళా సంఘాల వాళ్ళను పిల్చుకొస్తే, స్త్రీ ఉద్యమకారుల్ని పిలిస్తేనో, కాలేజీ స్టూడెంట్స్‌ని పిలిచి ఉద్యమం చేస్తేనో, ఇలా రకరకాలుగా ఆలోచిస్తూనే ఉంది. కానీ ఆమెకి ఏంచేయాలో తోచలేదు. నిజానికి సమస్య సమాజానికి సంబంధించిందే. కానీ ఎవరికి వాళ్ళు అది వ్యక్తిగత సమస్య అంటూ ఎవరినీ కల్పించుకోనివ్వటంలేదు. కట్నాల సమస్య కూడా సమాజానికి సంబంధించిందే. కాని అది కూడా వ్యక్తిగత సమస్య అని పోలీసులు కూడా కల్పించుకోవడంలేదు. ఎలా? ఎలా ఈ సమాజం మారేది.

శాంతి ఆలోచనల్లో ఉండగానే, ఆ భయంకర క్షణం రానే వచ్చింది. భారతికి మొహంనిండా పసుపు రాసి, పెద్ద కుంకుమబొట్లు పెట్టారు. చేతుల నిండా గాజులేశారు. పచ్చచీర కట్టబెట్టారు. విరబోసిన జుట్టుతో, గుండెలు పగిలేలా ఏడుస్తున్న భారతిని, ఆ దౌర్భాగ్యురాల్ని, ఆ నిస్సహాయురాల్ని, అదే జాతికి చెందిన మరికొందరు స్త్రీలు బలవంతంగా బైటికి తీసుకొచ్చారు. చీర చెంగుతో మొహం కప్పుకుని రోదిస్తున్న భారతిని చూస్తుంటే శాంతి రక్తం కుతకుత ఉడికిపోయింది.

ఎంత మోటుదనం? వీటినా సంప్రదాయాలనేది? ఇవేనా ఆచారాలు? రాజారామ్మోహన్‌రాయ్ ఎక్కడ? వీరేశలింగం ఎక్కడ? మీరంతా ఎక్కడ? మీ బోధనలతో మారిన సమాజం ఇది. చూడండి రండి, ఈ ఘోరాన్ని ఆపండి. నిస్సహాయురాల్ని కాపాడండి. సతీసహగమనం రూపుమాపామన్నారే. ఇంతకన్నా అదే నయం కాదా? ఒక స్త్రీని భర్తపోయిన దుఃఖంతో ఉన్న తోటి స్త్రీని ఇలా చిత్రవధ చేయడం నేరం కాదా? అయితే దీనికి శిక్ష నడిబజార్లో ఉరివేయటమే. రండి. వీళ్ళందరినీ ఉరి తీయండి. పుట్టుకతో సంపాదించుకున్న హక్కుల్ని నేలరాచి, చిత్రహింసల పాలు చేసే ఈ సంప్రదాయాన్ని ముక్కలు చేయండి. స్వార్థంతో, అసూయతో, అమానుషత్వంతో ఇంకా ఇలాంటి దురాచారాన్ని ఆచరించే ఈ సమాజాన్ని తగలబెట్టండి. రండి వీరేశలింగంగారూ, రాజారామ్మోహన్‌గారూ! బతికిరండి.

శాంతికి ఉప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది.

నడిబజార్లో ఒక స్త్రీని ఎంత ఘోరంగా అవమానిస్తున్నారు. ఇంతకన్నా దారుణం ఇంకోటుందా? ఈ సమాజానికి సిగ్గుందా? ఒక జీవితాన్ని సంప్రదాయాలకు వేలం వేస్తోంటే చూస్తూ ఊరుకునే ఈ సమాజానికి ఆత్మగౌరవముందా?

శాంతి ఇంక తట్టుకోలేకపోయింది. ఆమెలో ఆ ఆవేశం ఎక్కడనుంచి

వచ్చిందో, విసురుగా వెళ్ళి అడ్డొచ్చిన వాళ్ళని తోసేస్తూ, భారతి చేయి పట్టుకుని లాక్కొచ్చి, తన గదిలో పడేసింది. అదే ఆవేశంతో తలుపులు గడియవేసి అడ్డంగా నిల్చుంది.

"శాంతమ్మా! తలుపు తెరు శాంతమ్మా అది తప్పు" అని అరుస్తూ జనం తలుపు తడుతున్నారు. భయంతో బిగుసుకుపోయి, హఠాత్తుగా ఏం జరిగిందో, తెలుసుకున్న భారతి విహ్వలంగా పిలిచింది. "శాంతక్కా.. ఏ... ఏవిటిది?"

శాంతి జవాబు చెప్పలేదు. కళ్ళు మూసుకుని తలుపు కానుకుని అలాగే నిలబడింది. బైట నుంచి ఇంకా జనం అరుస్తూనే ఉన్నారు.

***

***(1 జూన్ 2003, ఆదివారం ప్రజాశక్తి)***